"ఆవేశం కాక ..... స్వామీ పొరపాటయిపోయిందంటూ నీ కాలిమీద పడిపోవాలా? నాకే కాని అధికారముంటే నీలాంటి స్వామిల్నీ, బాబాల్ని కుక్కల్ని కాల్చినట్టు కాల్చిపారేస్తాను. మీరు పని చెయ్యరు, చేసేవారినీ చెయ్యనివ్వరు.

ప్రపంచ దేశాల్లో ఇండియా అంటే ముందుగా గుర్తొచ్చేది మీరే.

ఏ పరికరాలూ లేని ప్రాచీనకాలంలోనే శస్త్ర చికిత్సలు చేసి మనుష్యుల ప్రాణాల్ని కాపాడిన చరకుడు, 1923లో మానవ ప్రాణాలను హరిస్తున్న ఫ్లూ, రక్తహీనతలకు అద్భుతమైన ఔషధం 'ఫోలిక్ యాసిడ్' , బోదకాలుకి హెట్రాజాన్ అతి శక్తివంతమైన యాంటీ బయాటిక్ 'ఆరోమైసిన్' వంటి దివ్యౌషధాన్ని కనుకున్న యల్లాప్రగడ సుబ్బారావు,

కాంతి పారదర్శక పదార్థాల గుండా ప్రసరించినప్పుడు దాని ఫ్రీక్వెన్సీలో జరిగే మార్పులు ప్రపంచానికి చాటి ఆ ప్రక్రియనే 'రామన్ ఎఫెక్ట్'గా కొనియాడబడి 1930లో 'నోబెల్ బహుమతి' పొందిన సర్ సి.వి. రామన్, ఆధునిక పారిశ్రామిక భారతావనికి ఆదిపురుషుడైన ఘనశ్యామ్‌దాస్ బిర్లా, ప్రోటీన్ సింథసిస్‌లో జెనిటిక్ కోడ్ ప్రక్రియ విధులను కనుక్కొని రసాయన శాస్త్రంలో 1968లో 'నోబెల్' బహుమతి పొందిన హరగోవింద ఖురానా, మానవ కంప్యూటర్‌గా గణతికెక్కిన శకుంతల ఇంకా ఎందరో గొప్పవాళ్ళకంటే ముందు విదేశీయులకి మన దేశం పేరెత్తగానే గుర్తొచ్చేది మీరే.

వీళ్ళందరికంటే మీ సాధువులు, బాబాలా గొప్పవాళ్ళు ..... ? కాదు. సర్వసంగ పరిత్యాగులనుకునే మీకు ఎ.సీలు, కార్లు, భవనాలు, సొంత విమానాలూ వగైరా ..... అందుకే నాకు మీ సాధువుల్నీ, బాబాలనీ చూస్తే రోత ..... "

"మహదేవ్! వాటీజ్ దిస్?" సీరియస్‌గా అడిగాడు అభిరాం.

ఆ సాధువు మహదేవ్‌ని అంచనా వేస్తున్నట్టు చూడసాగాడు. అభిరాం మహదేవ్‌ని తీసుకుని అక్కణ్నుంచి వడివడిగా ముందుకు సాగిపోయాడు.

కొంతదూరం వెళ్ళాక వెనుదిరిగి చూశాడు అభిరాం. ఆ సాధువు మహదేవ్‌నే తీక్షణంగా చూస్తున్నాడు. అదే సమయంలో మహదేవ్ ఆ దేవాలయం మెట్లు దిగసాగాడు. అభిరాం మహదేవ్‌పై నుంచి సాధువు వైపు దృష్టి మరిల్చాడు. అంతే ..... తీక్షణంగా అతడు మహదేవ్‌వంక చూస్తూ ముందుకు రాబోయి, తననే గమనిస్తున్న అభిరాంని చూసి వెనుదిరిగి దేవాలయం వెనుక వైపుకు సాగిపోయాడు.

అభిరాం గబగబా వెళ్ళి మహదేవ్‌ని సమీపించాడు.

"ఏమిటి వెనుకబడిపోయావ్?" అభిరాం వైపు చూసి అడిగాడు మహదేవ్.

"నువ్వు మెట్లు దిగుతూండగా నీలో ఏదైనా మార్పు రావటం గమనించావా?" అన్నాడు అభిరాం.

"మెట్లు దిగుతున్నప్పుడా?"

"అవును."

“ఒక్క క్షణం నా తలమీంచి వేడి సెగలాంటిది పయనించినట్లు అనిపించింది” అప్పుడు చూశాడు అభిరాం ..... మహదేవ్ తల వెంట్రుకలు అక్కడక్కడా అతి స్వల్పంగా కాలిపోయి వున్నాయి.

“సందేహం లేదు. ఆ సాధువు తాంత్రికుడే! అతనితో నువ్వు ఘర్షణపడి, దూషించినందుకు నీమీద ఆరత్యుంగ విద్య ప్రయోగించాడు.

అదృష్టవశత్తు అదే సమయంలో నువ్వు మెట్లు దిగుతూ అతని దృష్టి పథం నుంచి దిగువకి వచ్చేయడం, అతను ముందుకు రాబోతుండగా, నాకు అనుమానం వచ్చి, అతన్ని చూడటంతో, ఆ సాధువు వెనుదిరగటం వలన అతని కళ్ళల్లోంచి అరత్యుంగ ప్రయోగంవల్ల వచ్చిన అగ్ని కిరణాలు, జస్ట్ నీ తలవెంట్రుకల్ని తాకీ తాకనట్లు వెళ్ళిపోయి నువ్వు బతికి పోయావు” గబగబా చెప్పాడు అభిరాం.

“ఆరత్యుంగ ప్రయోగమా? అంటే ఏమిటి?” తన తలని తడుముకుంటూ అడిగాడు మహదేవ్.

“తంత్రలో అదొక విద్య. ఆ విద్య తెలిసినవాళ్ళు తమ తమ కళ్ళతో ఏ వస్తువునైనా తీక్షణంగా కొంచెంసేపు చూస్తే చాలు ఆ వస్తువు కాలి బూడిదైపోతుంది. ఎండలో భూతద్దం కింద వుంచిన కాగితం కాస్సేపటికి కాలిపోతుంది. అలాగే ఆరత్యుంగ విద్య తెలిసిన వ్యక్తుల కళ్ళు ప్రసరించిన అగ్ని కిరణాలు మరింత శక్తివంతంగా తమ లక్ష్యాన్ని కాల్చివేస్తాయి.

ఈ విషయాన్ని ప్రఖ్యాత పారాభౌతిక శాస్త్రవేత్త ‘క్రూక్స్’ కూడా ఎన్నో పరిశోధనలు చేసి ఈ విద్య ఉందని నిరూపించాడు అభిరాం.

“నువ్వు ప్రతిదాన్నీ మంత్ర తంత్రాలకి అన్వయించి చూస్తావ్. ఇప్పుడు మిట్టమధ్యాహ్నం అవుతుంది. ఒక్కసారిగా దేవాలయం నీడ నుంచి ఎండలోకి రావటంతో నాకలా అనిపించి వుండవచ్చు. దానికి నువ్వు ఏవేవో పేర్లు పెట్టేస్తున్నావ్” అభిరాం మాటలకి చిరునవ్వుతో జవాబిచ్చాడు మహదేవ్.

“నో ..... ఆ సాధువు నీవైపు తీక్షణంగా చూస్తున్నప్పుడే నువ్వు మెట్లు దిగుతున్నావ్. అదే సమయంలో నీ తలమీంచి వేడి వాయువు పయనించింది. ఇది ఖచ్చితంగా ఆరత్యుంగ ప్రయోగమే. ఆ సమయంలో నువ్వు మెట్లు దిగుతూ వుండకపోయినా, నేను సాధువుని గమనించక పోయినా, ఆరత్యుంగ ప్రయోగం వల్ల నువ్వీపాటికి కాలి బూడిదయి ఉండేవాడివి” తన మాటల్ని ఖాతరు చేయని మహదేవ్ వంక కోపంగా చూస్తూ అన్నాడు అభిరాం.

“సరేలే! ఎందుకంత కోపం?”

“నువ్వనసరంగా అతనితో గొడవపెట్టుకున్నావ్ ..... ” అన్నాడు అభిరాం.

ఆ మాటలకి జవాబేం ఇవ్వలేదు మహదేవ్.

“సాధారణంగా తాంత్రికులు శాంత స్వభావులై వుంటారు. నువ్వా సాధువు జీవనశైలి మీద, అతని అహంమీద దెబ్బకొట్టావ్. అందుకే అతను నీమీద అతి భయంకరమైన

ఆరత్యుంగ ప్రయోగించాడు. మనం తొందరగా ఈ ప్రదేశం నుంచి వెళ్ళిపోదాం" అంటూ కారు డోర్ తీసి కూర్చున్నాడు. మహదేవ్ కూడ కూర్చోగానే కారు కదిలిపోయింది.

కారు లెఫ్ట్ టర్న్ తిరిగి మెయిన్ రోడ్‌మీదకు చేరుకుంటుండగా ఓసారి ఆ దేవాలయంవైపు చూశాడు అభిరాం. దూరంగా నుంచుని తమ కారువంకే చూస్తున్న ఆ సాధువు కనిపించాడు.

"అదిగో చూడు ఆ సాధువు మనవంకే చూస్తున్నాడు" మహదేవ్‌తో అన్నాడు అభిరాం.

మహదేవ్ అటు తిరిగి చూశాడు. ఇంతలో హఠాత్తుగా ఓ ఆయిల్ టాంకర్ వచ్చి ఆగిందక్కడ. దాంతో ఆ సాధువు కనిపించలేదు అతనికి.

"హుఁ ..... నీదంతా చిత్త భ్రమ" కారు ఆ ప్రదేశాన్ని దాటి సాగిపోతుండగా అన్నాడు మహదేవ్.

"అయితే నా మాట నమ్మనంటావ్?"

"అందులో సందేహమేముంది?"

"అవునులే! ఏదయినా తనదాకావస్తే కాని తెలియదంటారు. నా అభిప్రాయం ప్రకారం ఈరోజు నువ్వు పెద్ద గండం నుంచి బయట పడినట్లే" సీరియస్‌గా డ్రైవ్ చేస్తూ అన్నాడు అభిరాం.

"అబ్బా ..... " కాస్త విసుగ్గా అన్నాడు మహదేవ్.

"మంత్రశక్తులు, మానవాతీత శక్తులు వున్నాయని నిన్ను నమ్మించటానికి నేనీ విధంగా చెప్పటంలేదు."

"ఓకే! అయితే మళ్ళీ అక్కడికే వెళదాం. ఈసారి ఆ సాధువు ఎదుట అతనిక్కావలసినంతసేపు నుంచుంటాను. అతడు నామీద ఏ ప్రయోగం చేస్తాడో చేసుకోమను" ఛాలెంజ్ చేస్తున్నట్లు అన్నాడు మహదేవ్.

"అవసరం లేదు. అక్కడికి మళ్ళీ వెళితే ఖచ్చితంగా నీకు ప్రమాదం జరుగుతుంది" అన్నాడు అభిరాం.

"నువ్వా దెయ్యాలు, భూతాలు, అకల్ట్ సైన్స్ పుస్తకాలు అదే పనిగా చదివి పూర్తిగా పాడయిపోయావ్" మందలింపుగా అన్నాడు మహదేవ్.

అభిరాం ఏం మాట్లాడకుండా మౌనంగా డ్రైవ్ చేస్తూ వుండిపోయాడు.

*　　*　　*　　*　　*

సమయం రాత్రి ఎనిమిది గంటలు. అభిరాం తన గదిలో పడుకొని ఏదో నవల చదువుకుంటున్నాడు. సరిగ్గా అప్పుడే కాలింగ్‌బెల్ మ్రోగింది. నవల మంచి ఇంట్రస్టుగా వున్న సమయంలో అంతరాయానికి విసుగ్గా లేచి వెళ్ళి తలుపు తీశాడతను.

బయట సుమారు ఓ అరవై ఏళ్ళ వ్యక్తి నుంచుని వున్నాడు. అతని చేతిలో ఓ బ్రీఫ్‌కేసుంది.

“సుమతమ్మగారిల్లు యిదేనా?” అడిగాడతను.

“అవును” బదులిచ్చాడు అభిరాం.

“ఉన్నారా?”

“ఉంది. రండి”అంటూ అతన్ని లోపలికి ఆహ్వానించి సోఫా చూపించాడు అభిరాం.

అతను బ్రీఫ్‌కేసు ఓ మూల వుంచి సోఫాలో కూర్చున్నాడు.

“అమ్మమ్మా! నీకోసం ఎవరో వచ్చారు.”

“నాకోసం ఎవరొస్తార్రా?” అంటూ బయటికి వచ్చిందామె.

ఆమెని చూడగానే ఆ వ్య క్తి చటుకున్న లేచి నిలబడ్డాడు.

“ఎవరూ?” పోల్చుకోలేనట్లు అడిగిందామె.

“నేను ..... వరప్రసాదాన్ని. బెజవాడలో చిన్నప్పుడు మనిళ్ళు పక్కపక్కనే వుండేవి. అప్పటి నీ వరప్రసాదం తమ్ముడ్ని.”

“ఓరి ..... ఓరి ..... ప్రసాదం నువ్వట్రా? పోల్చుకోలేకపోయాను. ఏమిటలా తయారయావ్?” అతని కెదురుగా సోఫాలో కూర్చుంటూ అడిగింది ఆమె.

“వయసుపై బడుతుందిగా. నీ ఆరోగ్యం ఎలా వుంది?” అంటూ అడిగాడతను.

“బాగానే వుందిరా.”

“ బాబా ..... ” అభిరాంని చూస్తూ అడిగాడతను.

“మనవడు.”

“ఓహో!”

“నా పెళ్ళయి మీ బావగారితో హైదరాబాద్ వచ్చేసిన తర్వాత నాలుగైదు సార్లే బెజవాడ వెళ్ళాను. నీ గురించి అడిగితే నీవు ఇంట్లోంచి పరారయి వెళ్ళిపోయావని చెప్పారు. ఎవరో అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకుంటే మీ వాళ్ళు ఒప్పుకోలేదని అలా చేశావని అన్నారు. ఇప్పుడు ఏం చేస్తున్నావ్? పెళ్ళీ గట్రా చేసుకున్నావా?”

“లేదక్కా! నేను ప్రేమించిన అమ్మాయిని తప్ప చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. అది జరగలేదు. నేనిలా వుండిపోయాను.”

“అదేం పనిరా?”

“అదంతా గతం. నేనో విషాదవార్త విన్నాను. అదే నీ కూతురూ, అల్లుడూ ..... ” అతని మాట పూర్తవకముందే సుమతమ్మ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

“మీ బావగారూ పోయారు ..... ఆయన పోయిన అయిదేళ్ళకు కూతురూ, అల్లుడూ రోడ్డు ప్రమాదంలో పోయారు. నేనింకా బ్రతికున్నానంటే వీడికోసమే” నిర్వేదంగా అందామె.

అతనా విషయాలన్నీ అమ్మమ్మకి గుర్తు చేయటం అభిరాంకి నచ్చలేదు.